కథా నిలయం
శ్రీకాకుళం

# వింతకోరిక

వజ్రాలు పొదిగిన చిన్న చిన్న బంగారు కూజాలలో సురాపానం చేస్తున్నారు అందరూ. అది స్వర్ణ లోకం. రాజకీయాలలో ఆరితేరిన వృద్ధులు, రాయుడుగారు, రెడ్డిగారు, చౌదరిగారు, దొరగారు మొదలైన వారు, ఒక గుండ్రని తెల్లని పాలరాతి గట్టు చుట్టూ కూర్చుని వున్నారు.

"అయ్యా తమరి పుత్రరత్నం, ప్రస్తుతం భారతదేశంలో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో పోటీ చేస్తున్నాడట గదా" అన్నారు రాయుడుగారు, రెడ్డిగారిని ఉద్దేశించి. "అవునూ మీ మనవడు తక్కువ తిన్నాడా. మీ వాడు ఇంకో పార్టీ తరపున పోటీ చేస్తున్నాడంట కదా". అన్నారు రాయుడు గారు. ఇంతలో "మా అబ్బాయి కూడా పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నాడు. పూర్తిగా నేను ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా మా వోడికి అడగకుండా సీటు ఇచ్చారండీ" అన్నారు చౌదరిగారు మీసాలు తిప్పుతూ. "హోసోస్. మీకు మీసాలు లేవు లెండి. అలా అటువేపు చేతులు పోనీయకండి. మన దేశంలోలా కాదు, ఇక్కడ భటులు చూశారంటే గొడవైపోద్ది. తొడలు కొట్టడం, మీసాలు దువ్వడం ఇక్కడ నిషేధం. నిజంగా కొండంతా రాతిమయమేనండీ బాబూ" అన్నారు దొరగారు.

"అయితే దొరగారూ, ఈ సారి మన రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు చాలా చిత్రంగా వున్నాయి సుమా" అన్నారు చౌదరిగారు. "అవునండోయ్. నేను రెండు రోజుల క్రితం కాకినాడ వెళ్ళానండి, మా వోడి ప్రచారం ఎలా వుందోనని- ఊపిరాడక చచ్చాననుకోండి" అన్నారు దొరగారు. "అదేంటండీ. ఈ లోకం లోంచి వెళ్ళిన మీకు ఊపిరి ఆడకపోవడమేమిటండీ" అన్నారు. అందరూ ఒకేసారి.

"అది కాదండి బాబూ మనకు ఈ లోకంలో అయితే, గాలీ, నీరూ, నిద్రా, నిప్పులూ అవసరం లేదనుకోండి, కాని పొరపాటున భూలోకం లోకి వెళ్ళామనుకోండి, మళ్ళీ మామూలేకదా. దేవకన్యని కాకా పట్టి పర్మిషన్ అడిగి భూలోకం లోకి వెళ్ళను కదా, రాజకీయ నాయకుల విగ్రహాలు ప్రజలకు కనపడకూడదట, దాని వలన వోటర్లు ప్రభావితం అవుతారని, ఎన్నికల నిబంధనలు పెట్టారుట. అందుకని నా విగ్రహానికి

పోస్ట్‌మార్టమ్ చేసిన శవానికి చుట్టినట్టుగా తెల్లని గుడ్డ చుట్టేశారండీ బాబూ. ఎవరైనా గుడ్డ విప్పుతారేమోనని ఎదురుచూశానండీ బాబూ. కాని చాంతాళ్ళతో బిగించి కట్టేశారు. అలాగే ఎలాగో తట్టుకుని విగ్రహంలోనే వుండిపోయాను. ఇదేం ఖర్మండీ మన అభిమానులు ప్రేమతో ప్రతిష్ఠించిన మన పాలరాతిబొమ్మ కూడా ఎన్నికలు చూడరాదంటే ఎలాగండీ"– అంటున్న దొర గార్ని చూస్తూ మిగతా వాళ్ళందరూముక్త కంఠంతో ఒకేసారి–

"భలే వారేనండి. మనమేమిటీ వృద్ధ రాజకీయ నాయకుల విగ్రహాలకు కూడా ఇదేగతి. అనవసరంగా మన విగ్రహాలు ప్రతిష్ఠించడం ఎందుకు, మన పీకలకూ, నడుముకూ, కాళ్ళకూ తాళ్ళు కట్టి పార్టీలు జెండాలు కట్టడం ఎందుకు, పక్షులు మన తలలపై నిలబడి కాలకృత్యాలు తీర్చుకోవడమేమిటి పైగా గొడవలైనప్పుడు మన విగ్రహాలపై పేడా పెంటా వెయ్యడమేమిటి. ఎందుకు? పైగా ఒక్కో చోట మన విగ్రహం ఒకోలావుంటుంది చాలా చోట్ల మన ప్రతిరూపంలా వుండనేవుండదు. ఛీ. ఇదేం బాగాలేదు. అందుకని మనందరం కలిసి ఇలా విగ్రహాలు పెట్టవద్దనీ ఒక తీర్మానం చేసి భూలోకానికి పంపించేద్దాం. అంటూ ఉద్రేకంగా అరుచుకుంటున్న వీరందర్నీ చూస్తూ, అటుగా వెళ్తున్న దేవకన్య గుబ్బిగా చూస్తూ దగ్గరకు వచ్చింది. వెంటనే గప్ చిప్ అయిపోయరందరూ.

"చింత చచ్చినా పులుపు చావలేదు, మిమ్మల్ని ఈ లోకంలో పెట్టవద్దని చెప్పినా యమధర్మరాజు వొప్పుకోలేదు. మీలో ప్రతీవారూ కాద్దోగోప్పో ప్రజలకు సేవ చేసి వుంటారని దయతలచి ఈ లోకంలో వుంచారు. మీ పరువు కాపాడుకుని బుద్ధిగా వుండండి. లేకపోతే నరకానికి పోతారు–" అంటూ విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె అటు తిరిగి వెళ్ళగానే అందరూ పకపకా నవ్వుతూ యమలోకం గుర్తుకు వచ్చి– ష్" అనుకుని సైలెంటయిపోయారు. ఇది ఇలా వుండగా, వాళ్ళకి కింద భూలోకంలో ఒక దృశ్యం కనపడసాగింది.

అక్కడ ఒక పెద్ద భవంతిలో – పెద్ద డబుల్ కాట్. దాని మీద గొప్ప రాజకీయ కురు వృద్ధుడు చావు బ్రతుకుల్లో వున్నాడు. తన చుట్టూ వున్న కొడుకుల్నీ, కూతుళ్ళనూ, మనుమలూ, మనుమరాళ్ళనూ, కార్యకర్తలనూ దగ్గరకు రమ్మని సైగ చేశారు. అందరూ దగ్గరగా వచ్చి "ఏమిటి చెప్పండి" అన్నారు. నాదో కోరిక తీర్చండి" అన్నారాయన లో గొంతుతో. "అలాగే –" అన్నారు. "అలాగే అంటే కాదు తప్పక తీర్చాలి" అన్నారాయన మళ్ళీ.

"ఏమిటి?" అన్నారు మళ్ళీ అందరూ. "నాకు శిలా విగ్రహం మాత్రం పెట్టకండి". అన్నారాయన. అందరూ నిరుత్సాహంతో ముఖాలు పెట్టి "అదేంటయ్యగారూ దేశంలో ఎక్కడా లేని విధంగా తమరిది రోల్డ్‌గోల్డ్ కవరింగ్ విగ్రహం పెట్టాలనుకున్నాం.

ఆర్డర్ ఇచ్చేశాం కూడా –" అని అందరూ అంటూంటే – "వద్దు గాక వద్దు" అంటూ ఆయన దగ్గ వచ్చి తల వెనక్కువాల్చేశారు. నాన్నా, తాతయ్యా, అయ్యగారూ, అంటూ అక్కడ ఉన్నవారంతా గొల్లుమన్నారు.

"అదిగో అటు చూడండి. పెద్దాయన తీర్మానం చేసేశాడు మహానుభావుడు. కాని వినరు గాక వినరు వాళ్ళు–" అంటున్నారు రాయుడు గారు నవ్వుతూ, మిగతా వారు ఆయనతో శృతి కలిపారు. అయినా ఇదేం కోరిక ఎవరైనా తనది ఖరీదైన విగ్రహం పెట్టమంటారు గాని. ●

**(విధి విలాసం, మాసపత్రిక, మార్చి 2010)**